ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

కర్ణాటక వార్తలు
బుధవారం 13 ఆగస్టు 2025

కేఎంఎఫ్ లాభాల బాట పట్టేనా..?

● కొత్త అధ్యక్షుడు హిట్నాళ్‌పైనే ఆశలు
● మాజీ అధ్యక్షుడు బీమానాయక్ పాలనలో రూ.7కోట్ల నష్టాలు

8

కాంగ్రెస్‌లో కలవరం..!



● రాజణ్ణపై వేటుతో నేతల్లో భయం.. భయం ● విధానసౌధలో ఇదే హాట్‌టాపిక్ ● సీఎల్పీలోనూ కీలక విషయాలపై సీనియర్ల మౌనం

బెంగళూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా ఓట్ల చౌర్యంపై పోరాటానికి సిద్ధమయ్యారు. కేంద్రంలోని బీజేపీతోపాటు వివిధ రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు రాహుల్‌గాంధీ తీరుపై మండిపడుతున్నాయి. ఇలా సాగుతున్న తరుణంలోనే రాష్ట్ర సహకార శాఖ మంత్రి రాజణ్ణ నగరంలోని మహదేవపురలో ఓట్ల చౌర్యం జరిగే సమయానికి ప్రభుత్వం మనదేనని వ్యాఖ్యానించారు. రాజణ్ణ ముక్కుసూటిగా వ్యవహరించేవారని, ఆయన చాలా సందర్భాలలో నోరు జారుతారనేది తెలిసిందే. ఇదే అవకాశంగా తీసుకుని కొందరు కీలకనేతలు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. రెండు వారాల క్రితం పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలాపైన కూడా తీవ్రమైన విమర్శలు చేశారు. అన్నింటిని కలిపి రాహుల్‌గాంధీకి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశాన్ని రాహుల్‌గాంధీ తీవ్రంగా పరిగణించారు. రాష్ట్రంలో శాసనసభ సమావేశాలు జరుగుతున్నాయని, ప్రస్తుతం ఎటువంటి నిర్ణయం తీసుకున్నా పెను ప్రభావం చూపనుందని సీఎం సిద్దరామయ్య తీవ్రమైన కసరత్తు జరిపారు. అందుకు రెండు కారణాలు ఉన్నాయి. రెండేళ్లుగా సీఎంకు అత్యంత ఆప్తుడిగా కొనసాగడం, మరోవైపు శాసనసభ సమావేశాలు ఉండడమే. నేరుగా రాహుల్‌గాంధీకి ముఖ్యమంత్రి ఫోన్ చేసి పరిస్థితిని వివరించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. కానీ ఫోన్‌లో రాహుల్‌గాంధీ శాక్ హిమ్... (అతడిని తొలగించు) అంటూ మరో మాట మాట్లాడకుండా ఫోన్‌కట్ చేసినట్లు సమాచారం. దీంతో ముఖ్యమంత్రి కూడా ఏ నిర్ణయం తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. వాస్తవానికి సోమవారం ఉదయం శాసనసభ సమావేశాలకు వచ్చేందుకు ముందే రాజణ్ణ, సీఎం అధికారిక నివాసంలో ముఖ్యమంత్రిని కలిశారు. పరిస్థితిని వివరించారు. దీంతో రాజణ్ణ కూడా అధిష్టానం మాట వద్దని, మీ నిర్ణయం చెప్పండి అంటూ కోరినట్టు తెలుస్తోంది. మీరు రాజీనామా చేయమంటే ఒక్క క్షణం కూడా ఆలోచించనని తేల్చిచెప్పినట్టు సమాచారం. అక్క డే ఓ పేపర్‌లో రాజీనామా లేఖను రాసి పెట్టినట్టు తెలుస్తోంది. రాజీనామా లేఖ తీసుకున్నా రాహుల్‌గాంధీ ఆదేశాలు పాటించినట్టు ఉండదనే ముఖ్యమంత్రి, గవర్నర్‌కు లేఖ రాసి వెంటనే కేబినెట్ నుంచి రాజణ్ణను తొలగించాలని సిఫారసు చేశారు. ఆ తర్వాత కాసేపటికే రాజ్‌భవన్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఈ ప్రక్రియ సాగుతున్న సమయంలో రాజణ్ణ విధానసౌధలోనే ఉన్నారు. సాయంత్రానికి రాజణ్ణను మరోసారి సీఎం నివాసానికి పిలిపించుకున్నట్లు తెలుస్తోంది. పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఆ తర్వాత మీడియా ముందుకు వచ్చిన రాజణ్ణ నాపై ఎవరు ఫిర్యాదులు చేశారో అన్నీ తెలుసునని సమయం వచ్చినప్పుడు చెబుతానని త్వరలోనే ఢిల్లీ వెళ్లి కారణాలు వివరిస్తానన్నారు. రాజణ్ణకు రాజీనామా చేసే అవకాశం కూడా లేకుండా అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్ర పార్టీ నేతలలో గుబులు పట్టుకుంది. ఇక అధిష్టానానికి వ్యతిరేకంగా నోరు తెరవకూడదని అందరికీ గుణపాఠమైంది. మరోవైపు మంత్రుల్లో మార్పులు జరపాలని భావిస్తున్న అధిష్టానం నిర్ణయం తీసుకున్నా ఎదురు తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. మంగళవారం రాత్రి ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన సీఎల్పీ సమావేశంలో శాసనసభ సమావేశాలలో ఎదుర్కోవాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాజణ్ణ పరిణామంతో ఎవరూ గట్టిగా మాట్లాడే ప్రయత్నం కూడా చేయలేదని సమాచారం.

మొన్న బీజేపీలో.. నేడు కాంగ్రెస్‌లో..

బీజేపీలో ఎమ్మెల్యేగా ఉంటూనే సొంతపార్టీ నాయకుల తీరును ఎండగట్టడం, ఎవరినైనా లెక్కచేయకుండా మాట్లాడేలా వ్యవహరించిన బసనగౌడ పాటిల్ యత్నాళ్‌పై పార్టీ అధిష్టానం కోలుకోలేని దెబ్బతీసింది. ఆయనను ఆరేళ్లపాటు పార్టీనుంచి సస్పెండ్ చేసింది. ఇక కాంగ్రెస్‌లోనూ రాజణ్ణ అదే తరహాలోనే వ్యవహరించారు. ఎవరి విషయమైనా లెక్కచేయకుండా మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఏకంగా మంత్రి పదవినుంచి తొలగించారు. రాష్ట్రంలో రెండు పార్టీలకు చెందిన ఫైర్ బ్రాండ్ అనిపించుకున్న ఇద్దరిపై ఢిల్లీ పెద్దలు కోలుకోలేని దెబ్బతీశారు.



ప్రపంచ ఏనుగుల దినోత్సవంలో మంత్రి ఈశ్వర్‌ఖండ్రె, అటవీ శాఖ అధికారులు

అత్యధిక ఏనుగులు గర్వకారణం

● తరచూ ప్రమాదాలు ఆందోళన కలిగిస్తాయి: ఏనుగుల దినోత్సవంలో మంత్రి ఖండ్రే

బెంగళూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక ఏనుగులు ఉన్నాయనే మంచి పేరు గర్వకారణమని, అయితే ఎప్పుడు ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోననే భయం కూడా ఉందని అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె అభిప్రాయపడ్డారు. మంగళవారం రాష్ట్రం అటవీ, వన్యప్రాణులు, వాతావరణంలో మార్పులకు సంబంధించి ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మనం ఆధునిక, అభివృద్ధి, ఆర్థిక ప్రగతి గురించి మాట్లాడతామని, కానీ పర్యావరణ రక్షణ, వనరుల సంరక్షణ, విద్యుత్ ఆదా వంటి అంశాలపై ఆలోచించడం లేదన్నారు. వాతావరణ మార్పులతో విశ్వవ్యాప్తంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయని ప్రకృతిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఒక వ్యక్తి జీవనానికి ఏడు చెట్లు పెంచాలని కానీ బెంగళూరులో ఏడుగిరికి ఒక చెట్టు లేదన్నారు. లాల్‌బాగ్, కబ్బన్‌పార్క్‌లు ఏర్పడి 150ఏళ్లు దాటిందని, ఆ తర్వాత మరో పార్కు రాలేదన్నారు. ప్రపంచ ఏనుగుల దినోత్సవం పర్యావరణ రక్షణ, భావితరాలకు సమాచారం అందించాలన్నదే లక్ష్యమన్నారు. ప్రముఖ క్రికెటర్, వన్యప్రాణుల రాయబారి అనిల్‌కుంబ్లె, రచయిత రోహిణి నీలేకని, గాయకుడు రికీకేజ్‌లు పాల్గొన్నారు.



హొసపేటలో 405 అడుగుల బృహత్ జాతీయ పతాక ధ్వజ స్తంభం

పతాకాన్ని పట్టించుకోరూ..!

● నిర్లక్ష్యానికి గురవుతున్న భారీ జాతీయ జెండా స్తంభం
● స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్నా పరిశుభ్రతా చర్యలు శూన్యం

7



సభలో ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

తీన్‌మార్..!

● ఆర్సీబీ ఉత్సవాలు, ధర్మస్థళ, రాజణ్ణ వివాదాలపై అట్టుడికిన అసెంబ్లీ ● ఇవే అంశాలపై చర్చకు బీజేపీ పట్టు



ప్రతిపక్ష నేత అశోక్

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాల్లో రెండో రోజున మూడు కీలక వివాదాలపై అట్టుడికింది. మంగళవారం కలాపాలు ప్రారంభం కాగానే ప్రతిపక్ష బీజేపీ సభ్యులు ,ధర్మస్థళ వివాదంపై సుదీర్ఘ చర్చకు పట్టుబట్టారు. ఎప్పుడు జరిగాయో ఏం జరిగిందో సమగ్ర ఆధారాలు లేకుండానే ధర్మస్థళకు అనుబంధమైన అటవీప్రాంతం, నేత్రావది నది ఒడ్డున తవ్వకాలు సాగుతున్నాయని మండిపడ్డారు. ఇదే సందర్భంలో కాంగ్రెస్ సభ్యులు సిట్ విచారణ జరుపుతోందంటూ చర్చ ఎలా సాధ్యమని అభ్యంతరం తెలిపారు. బీజేపీ సభ్యులు సునీల్‌కుమార్‌తో పాటు పలువురు తీవ్రస్థాయిలో ధర్మస్థళపై సాగుతున్న కుట్రకు సూత్రధారులు ఎవరని ప్రశ్నించారు. వివాదంలో రోజుకో పాత్ర తెరపైకి వస్తోందన్నారు. ధర్మస్థళ ప్రాంతంలో మృతదేహాలను పూడ్చిపెట్టామని చెప్పే వ్యక్తులు ప్రతి రోజూ ఎక్కడి నుంచి వస్తున్నారని, సాయంత్రం ఎక్కడికి వెళుతున్నారంటూ నిలదీశారు. ఇదంతా అతడికి ఎవరు సలహాలిస్తున్నారంటూ మండిపడ్డారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. స్పీకర్ యూటీ ఖాదర్ ఇరుపక్షాల సభ్యులను సమాధాన పర్చారు. కనీసం గంట సమయం అయినా చర్చకు అవకాశం ఇవ్వాలని బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. ఇప్పటికే ధర్మస్థళ పరువు తీస్తున్నారని మరో వైపు అతడికి మానసిక స్థితి బాగాలేదని కూడా ఆరోపణలు ఉన్నాయన్నారు. అందుకు స్పీకర్ లిఖిత పూర్వకంగా వినతి ఇస్తే పరిశీలిస్తానన్నారు. అంతలోనే హోంమంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ 'సిట్' విచారణలు జరుపుతున్న తరుణంలో సభలో అదే అంశంపై చర్చ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 'సిట్' విచారణ పూర్తి అయిన తర్వాతే చర్చకు అవకాశం ఉంటుందని తేల్చి చెప్పారు.

ఆర్‌సీబీ విజయోత్సవాల్లో తప్పెవరిది... శిక్ష ఎవరికి..?

శాసనసభలో ఆర్సీబీ విజయోత్సవాలలో తొక్కిసలాటలో 11 మంది మృతి సంఘటనపై బీజేపీ సభ్యులు చర్చకు డిమాండ్ చేశారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ ఆర్సీబీ జట్టు కొన్నేళ్ళ తర్వాత ఫైనల్‌కు చేరిందని ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో విజేతగా నిలిచిందన్నారు. జూన్ 3న ఫైనల్ మ్యాచ్ విజయం సాధించేందుకు రాత్రి 11గంటల అయ్యిందన్నారు. ఒక్కసారిగా క్రికెట్ అభిమానులలో ఎనలేని సంతోషం పెల్లుబికిందన్నారు. దీంతో రాత్రంతా సంబరాలు జరిగాయన్నారు. తెల్లవారు దాకా బెంగళూరులో విజయోత్సవాలు జరిగాయని పోలీసులు రాత్రి నిద్ర లేకుండా బందోబస్తు చేపట్టారన్నారు. మరుసటి రోజు మధ్యాహ్నమే విజయోత్సవాలు జరిపారన్నారు. విజయోత్సవాల క్రెడిట్ దక్కించుకోవాలని డీసీఎం డీకే శివకుమార్ అత్యుత్సాహం చూపా రన్నారు. పోలీసులు బందోబస్తు కష్టమని, అభిమానులు ఎక్కువమంది వస్తే ఇబ్బందికరమని సూచించినా ఏమాత్రం పట్టించుకోకుండానే అది కూడా ఒకచోటు కాకుండా విధానసౌధ ప్రాంగణంలో ప్రభుత్వం ఆధ్వర్యంలోను చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్‌సీబీ ఈవెంట్ మేనేజ్‌మెంట్, కర్ణాటక క్రికెట్ అసోషియేషన్ల ఆధ్వర్యంలో సంబరాలు చేశారన్నారు. రెండు చోట్ల విజయోత్సవాలు ఎందుకు చేయాల్సిన అవసరం ఏం వచ్చిందన్నారు. క్రికెటర్‌లు కాకుండా షీల్డుతో ఎవరు ఫోజులు ఇచ్చారో అందరికీ తెలిసిందేనన్నారు. 11 మంది మృతికి కారకులు ఎవరనేది తేల్చకుండా అంతా పోలీసులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌దే తప్పిదంగా తేల్చారన్నారు. ఒక్కరోజులోనే అంత హడావుడిగా సంబరాలు చేయాల్సిన అవసరం ఏమిటనేది తేల్చాలన్నారు. ఇదే విషయమై అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యుల మధ్యన వాగ్వాదం చోటు చేసుకుంది.

రాజణ్ణను ఎందుకు తొలగించారు?: బీజేపీ

సహకార శాఖా మంత్రి రాజణ్ణను ఎందుకు కేబినెట్ నుంచి తొలగించారనేది స్పష్టం చేయాలంటూ బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. రాజణ్ణకు మద్దతుగా బీజేపీ సభ్యులు మాట్లాడారు. ఒక మంత్రిని తొలగించిన అంశంపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభ జరిగే సందర్భంలో మంత్రిని తొలగించిన అంశంపై చర్చ జరగాల్సిన అవసరం లేదనడం సరికాదన్నారు. అందుకు స్పీకర్ జోక్యం చేసుకుని సమయం వచ్చినప్పుడు చెబుతారన్నారు. అందుకు ప్రతిపక్ష పార్టీ సభ్యులు ససేమిరా అన్నారు. సీఎం సభకు వచ్చిన వెంటనే వివరణ ఇవ్వాల్సిందేనన్నారు. ఇది పార్టీకి సంబంధించిన అంతర్గత వ్యవహారం ఎలా అవుతుందన్నారు. దీంతో ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ నిరసన చేశారన్నారు. మన ప్రభుత్వ పాలనలోనే లోక్‌సభ ఎన్నికలు జరిగాయనేది వాస్తవం కాదా అన్నారు. ఇవే విషయాలను రాజణ్ణ కూడా మాట్లాడారని అంతమాత్రన ఏకంగా మంత్రి పదవి నుంచి తొలగిస్తారా అంటూ మండిపడ్డారు. సభ జరిగే సందర్భంలో ఇటువంటి అంశాలపై మాట్లాడరాదంటే ఎలాగని ప్రశ్నించారు. దీంతో సభలో గందరగోళం జరిగింది. సభను చీకటిలో ఉంచడం సరికాదన్నారు ఇలా ప్రతి అంశంలోను అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.


పల్లె పల్లెకు గ్రంథాలయం

● 6,599 లైబ్రరీల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు ● ఊరూరా రూ.2లక్షల పుస్తకాలు

బెంగళూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రజల్లో జ్ఞానం పెంపొందించడంతోపాటు, పిల్లల్లో చదువుపట్ల అభిరుచి పెంచేందుకు కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ 6,599 గ్రామీణ గ్రంథాలయాలను తెరిచేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. వాటికి అనుబంధంగా కేంద్ర ప్రభుత్వ పథకం స్పెషల్ అసిస్టన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌లో భాగంగా గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. డిజిటల్ మౌలిక సదుపాయాల ద్వారా పిల్లలతోపాటు యువతను దృష్టిలో ఉంచుకుని 31 జిల్లాల్లోనూ గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నారు. డిజిటలీకరణ, మౌలిక సదుపాయాలకు కేంద్రప్రభుత్వం సాయం చేయనుంది ఇప్పటికే పలు జిల్లాల్లో భవనాలు గుర్తించే ప్రక్రియ ప్రారంభించారు. ప్రతి గ్రంథాలయానికి రూ.2 లక్షల విలువైన పుస్తకాలను నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియానుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. జిల్లా పంచాయతీలకు సరఫరా చేయనున్నారు. వీటిలో 2040 కన్నడ, 627 ఇంగ్లిష్, 20 నైపుణ్య విజ్ఞాన పుస్తకాలతో కలిపి 2,687 పుస్తకాలు ప్రతి గ్రంథాలయానికి పంపనున్నారు. పిల్లలతోపాటు సైన్స్, టెక్నాలజీ, జీవిత చరిత్రలు, పిల్లలు, సముదాయాలకు సంబంధించిన కార్యకలాపాలతోపాటు వైవిధ్యమైన విషయాల పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచనున్నారు.

గ్రంథాలయాల నిర్వహణ ఇలా...

కొత్తగా ప్రారంభించే గ్రంథాలయాలు ప్రతి శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు కనీసం నాలుగుగంటలపాటు అందుబాటులో ఉండాలి. గ్రంథాలయాలను గ్రామపంచాయతీ స్థాయిలో స్వయం సహాయకసంఘాలు నిర్వహించాలి. కొత్తగా సిబ్బందిని నియమించుకునే అవకాశం లేదు. పర్యవేక్షణ బాధ్యత స్వయం సహాయక సంఘాలకే అప్పగిస్తారు. ప్రతిరోజూ 350 రూపాయల చొప్పున సదరు స్వయం సహాయకసంఘానికి పంచాయతీ సొంత వనరుల ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. కొత్త గ్రామ గ్రంథాలయాలకు లక్ష రూపాయలు వెచ్చించి కంప్యూటర్, యూపీఎస్ ఏర్పాటు చేస్తారు.



గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం

ఏర్పాటుకానున్న గ్రంథాలయాల వివరాలు

తుమకూరు 501, బెళగావి 477, హాసన్ 407, కోలారు 295, కలబురగి 291, మైసూరు 270, ఉత్తరకన్నడ 285, శివమొగ్గ 258, బాగల్కోటె 180, బళ్ళారి 89, బెంగళూరు గ్రామీణ 185, బెంగళూరు నగర 120, చామరాజనగర 125, మండ్య 275, దక్షిణకన్నడ 150, దావణగెరె 176, గదగ్ 92, హావేరి 191, కొప్పళ 155, రాయచూరు 230, విజయపుర 280, విజయనగర 150, ధారవాడ 110, చిక్కమగళూరు 218, కొడగు 60, రామనగర 193, బీదర్ 205, యాదగిరి 140, చిక్కబళ్ళాపుర 200, చిత్రదుర్గ 216, ఉడుపి 95 గ్రంథాలయాలను ఏర్పాటు చేయదలిచారు. కొత్త గ్రంథాలయాల భవనాలకు అవసరమైన మౌలిక సదుపాయాలకోసం ఆధునికీకరణ, విద్యుత్, ఇంటర్నెట్, సౌకర్యం, తాగునీరు, ఫ్యాన్ వంటి సదుపాయాలను గ్రామపంచాయతీ సొంత నిధులతో ఏర్పాటు చేయనున్నారు.



కొప్పళలో సొసైటీ ముందు వేచి ఉన్న రైతులు

8

యూరియా కోసం బారులు తీరిన రైతులు

● గంటల తరబడి వేచి ఉన్నా దొరికేది గగనమే ● కొరతపై మండిపడుతున్న రైతులు

మూటల్లో కాళ్లు, చేతులు..!

● మహిళ దారుణ హత్య కేసును ఛేదించిన పోలీసులు
● అల్లుడే కడతేర్చాడని నిర్ధారణ.. ముగ్గురి అరెస్ట్

బెంగళూరు, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఇటీవల తుమకూరు జిల్లా కొరటగెరెలో లక్ష్మీదేవి అనే మహిళను ముక్కలుగా కత్తిరించి ప్లాస్టిక్ కవర్‌లలో వేసి పలుచోట్ల పడేసిన కేసును పోలీసులు ఛేదించారు. డెంటిస్ట్ అయిన అల్లుడే హంతకుడని పోలీసులు నిర్ధారించారు. దంత వైద్యుడు రామచంద్రప్ప సహా అతడి సహచరులు ఇద్దరిని అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ అశోక్ సోమవారం మీడియాకు తెలిపిన వివరాల మేరకు కొరటగెరె పరిధిలోని కొళాలు గ్రామానికి వెళ్ళే రోడ్డు పొడవునా మహిళ శరీర భాగాలతో ఉన్న ఏడు ప్లాస్టిక్ సంచుల్లో 19 ముక్కలుగా ఉండే భాగాలను ఈనెల 7న గుర్తించిన కొరటగెరె పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలిని లక్ష్మీదేవి(42)గా గుర్తించారు. తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్ కేవీ నేతృత్వంలో దర్యాప్తు జరిపిన పోలీసులు దంతవైద్యుడిగా కొనసాగిన అల్లుడు రామచంద్రప్ప ప్రమేయంపై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారణ జరుపగా హత్య చేసినట్లు అంగీకరించారు. మిత్రులు సతీష్, కిరణ్‌లతో కలిసి దారుణానికి పాల్పడినట్లు అంగీకరించారన్నారు. లక్ష్మీదేవి రెండో కుమార్తెను డాక్టర్ రామచంద్ర 19 ఏళ్ళ కిందట పెళ్ళి చేసుకున్నారు. ఇది రామచంద్రకు రెండోవివాహం. లక్ష్మీదేవి వ్యవహరిస్తున్న విధానంపై అల్లుడు రామచంద్రకు అసంతృప్తి ఉండేది. భార్యను అత్త చెడగొడుతున్నారని భావించి తీవ్రమైన కోపంతో ఉండేవారు. ఈనెల 7న నగరానికి వచ్చిన లక్ష్మీదేవిని కారులో వదిలిపెట్టి వస్తానంటూ డాక్టర్ రామచంద్ర తీసుకెళ్ళారు. కొరటగెరెలోనే ఆమెను హత్య చేసి అతర్వాత సతీష్‌కు చెందిన తోటకు తీసుకెళ్ళి 19 ముక్కలుగా చేసి 7 ప్లాస్టిక్ సంచుల్లోకి నింపి రోడ్డుపక్కన పడేశారు. లక్ష్మీదేవిని కారులో ఎక్కించుకుని నగరమంతా తిరిగినట్లు సీసీ కెమెరాల ఫుటేజీల ద్వారా పోలీసులు గుర్తించారు. అనుమానం కలిగిన కారు సతీష్ పేరుతోనే ఉంది. లక్ష్మీదేవి హత్యకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

స్వాతంత్ర్య వేడుకలకు సర్పంచ్‌కు ఆహ్వానం


భరత్‌కుమార్

గుత్తి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు మండలంలోని వెంగన్నపల్లి సర్పంచ్ భరత్‌కుమార్‌కు ఆహ్వానం అందింది. ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఆహ్వానపత్రం పంపారు. కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంలో మెరుగైన పనితీరు కనబరచిన సర్పంచ్‌లు రాష్ట్రవ్యాప్తంగా పది మందిని ఎంపిక చేశారు. వారి భరత్‌కుమార్ కూడా ఉన్నారు. దీంతో ఆయన ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

బొందలవాడ సర్పంచ్‌కు రాజ్‌భవన్ పిలుపు


ఆలం శిరీషా

నార్పల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ సర్పంచ్ ఆలం శిరీషకు అరుదైన గౌరవం దక్కింది. గతంలో జడ్పీటీసీగా, ప్రస్తుతం సర్పంచ్‌గా ఆమె చేసిన సేవలను గుర్తించి, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న రాష్ట్ర గవర్నర్ ఆధ్వర్యంలో రాజ్ భవన్‌లో నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొనాలని రాజ్‌భవన్ వర్గాలు కోరాయి. రాజ్‌భవన్ ఆహ్వానం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకురాలికి..


విష్ణుప్రియ

అనంతపురంరూరల్, (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలు విష్ణుప్రియకు రాష్ట్ర రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం అందింది. మంగళవారం గవర్నర్ కార్యాలనుంచి ఉత్తర్వులు వచ్చినట్లు విష్ణుప్రియ పేర్కొన్నారు. రాజ్ భవన్‌లో నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ఆమె సేవలను గుర్తించి, ఈ అవకాశం కల్పించారు. దీంతో అధ్యాపకురాలు విష్ణుప్రియ ఆనందం వ్యక్తం చేశారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత కలిగిన పాఠశాలల నుంచి క్రీడాప్రతిభా అవార్డులు 2024-25 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ క్రిష్టప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ప్రదర్శనలు మాత్రమే ఎంపికకు పరిగణనలోకి తీసుకుంటారన్నారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని అన్ని పాఠశాలల మేనేజ్‌మెంట్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సర్టిఫికెట్‌లు హెడ్‌మాస్టర్, పీఈటీ, పీడీ సంతకాలతో జిరాక్స్ కాపీలను సమర్పించాలన్నారు. టీం ఈవెంట్స్, వ్యక్తిగత ఈవెంట్స్ పాయింట్‌లను పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు. ప్రతిక్రీడలో అత్యధిక స్కోర్ సాధించిన పాఠశాలలు , స్కోర్ అగ్రస్థానంలో ఉన్న పాఠశాలలను అవార్డులకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. డీఈఓ అధ్యక్షతన ఐదుగురు సభ్యుల గల కమిటీ ద్వారా దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. ఎంపికైన ఐదు పాఠశాలలకు జాతీయ క్రీడాదినోత్సవం ఆగస్టు 29న అవార్డులు అందజేస్తామని తెలిపారు.

హెచ్‌ఐవీ నివారణపై విస్తృత ప్రచారం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, సుఖవ్యాధుల నియంత్రణ, మాదక ద్రవ్యాల వినియోగ చెడు ప్రభావాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ పర్యవేక్షకులు జీవీ రమణ అధ్యక్షతన మంగళవారం ఆమె పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అంతకుముందు అంబేడ్కర్ సర్కిల్, జడ్జి బంగ్లా వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ అధికారి ఓబులు, ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ పర్యవేక్షకులు మురళీమోహన్, రైడ్స్ క్రిష్టప్ప, లింక్ వర్కర్ రమేష్, అనంత నెట్‌వర్క్ సిబ్బంది, ఎన్జీఓ మేనేజర్లు నరేష్, మహేష్, శ్రీనివాసరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రమేష్, నీలకంఠ పాల్గొన్నారు.

డంప్‌పై దర్యాప్తునకు ఎస్పీ ఆదేశం...!

అనంతపురం క్రైం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): పేలుడు పదార్థాల డంప్‌పై ఎస్పీ జగదీష్ విచారణకు ఆదేశించారు. సమగ్రంగా విచారణ చేయాలని సంబంధిత పోలీసులను ఆదేశించారు. ఆత్మకూరు మండలం వేపచెర్ల సమీపంలో కొండగుట్ట ప్రాంతంలో పేలుడు పదార్థాలున్నట్టు ఆత్మకూరు పోలీసులు గుర్తించారు. 90 డిటోనేటర్లు, 9ఎంఎం రౌండ్లు 70, ఐరన్‌బాల్స్ 20, వైట్ రబ్బర్ ఖాళీ కాక్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కొండగుట్ట ప్రాంతంలో భారీ స్థాయిలో పేలుడు పదార్థాల డంప్ బయటపడటంపై సంబంధిత పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డంప్ ఎవరు, ఎందుకు, ఎప్పుడు చేశారన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

వీఆర్‌కు పట్నం ఎస్‌ఐ రాజశేఖర్

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్నం ఎస్‌ఐ రాజశేఖర్‌ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ రత్న మంగళవారం ఉత్వర్వులు జారీచేశారు. ఎస్‌ఐపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విచారణలో ఆరోపణలు రుజువైతే ఎస్‌ఐపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాయని ఎస్పీ తెలిపారు.

గంజాయి విక్రేత పరారీ

కదిరిఅర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పోలీసులు వస్తున్నారన్న సమాచారంతో గంజాయి విక్రేత పరారైన సంఘటన మండలంలోని సున్నపుగుట్టతండాలో మంగళవారం జరిగింది. గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నట్లు గ్రామస్థుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు గ్రామానికి బయల్దేరారు. ఈ విషయం తెలుసుకున్న గంజాయి విక్రేత షామీర్ పరారయ్యాడు. గ్రామంలో షామీర్ గంజాయి విక్రయిస్తు, సేవిస్తూ గ్రామస్థులను ఇబ్బంది పెడుతున్నాడని, పిల్లలు, మహిళలు తిరగాలంటేనే భయపడే పరిస్థితి ఉందని పలువురు స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థులు ఫోన్ చేయడంతో తమ సిబ్బంది గ్రామానికి వెళ్లే లోపు అతను పారిపోయాడన్నారు. అతను గంజాయిని మద్యంగా భ్రమించి సేవిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారన్నారు. పరారైన షామీర్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

గుంతకల్లుటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ పట్టణ, మండల కమిటీని మంగళవారం ఎన్నిక చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడిగా మోహన్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, మండల అధ్యక్షుడిగా చిన్న, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున, మహిళా పట్టణ అధ్యక్షురాలిగా తలారి శిరీష, ఉపాధ్యక్షురాలిగా మాసిపోగు సోని, ప్రధాన కార్యదర్శిగా జీఎస్ రామకృష్ణమ్మ, సహాయ కార్యదర్శిగా జయలక్ష్మిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదినారాయణ, జన్నేమస్తాన్, జయరాం, వన్నూరప్ప, అడవిరాముడు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన అనంత

అట్టహాసంగా సీపీఐ జిల్లా మహాసభలు ప్రారంభం

నగరంలో భారీ ర్యాలీ

అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నించండి

: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ


ర్యాలీ చేస్తున్న సీపీఐ రామక్రిష్ణ, అక్కినేని వనజ ఇతర నేతలు

అనంతపురం విద్య, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): అనంత వీధులు ఎరుపెక్కాయి. వందలాది మంది సీపీఐ శ్రేణుల ర్యాలీతో రోడ్డు ఎర్ర రంగును పరచుకున్నాయి. సీపీఐ జిల్లా మహాసభలు మంగళవారం నగరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సీపీఐ శ్రేణులు, కళాకారులు నృత్యాలు చేస్తూ, ఎర్రజెండాలను చేతబూని ర్యాలీ చేపట్టారు. ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా కేఎస్‌ఆర్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద వరకు సాగారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ మాట్లాడుతూ.. ధైర్యంగా మాట్లాడేవాడే కమ్యూనిస్టు అన్నారు. ఎక్కడ అన్యాయం జరిగినా ఎర్రజెండా అక్కడ పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయనీ, అందరూ ముందుకొచ్చి అన్యాయాలు, అక్రమాలపై ధైర్యంగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జగన్ తరహాలోనే కూటమి పాలన సాగుతోందన్నారు. జగన్ ఇంట్లో కూర్చుని బటన్లు నొక్కుతూ పాలన మరచిపోవడంతో ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. చంద్రబాబుకు ఊహించని విధంగా 164సీట్లు రావడంతో ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి రాజధాని పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు చేస్తున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెరిగిపోయిందన్నారు. ఎమ్మెల్యేల అరాచకాలు, దౌర్జన్యాలు మితిమీరిపోయాయన్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేస్తామన్నారు. సీపీఐ జాతీయ కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో రాజకీయాలు దారుణంగా తయారయ్యాయన్నారు. ప్రజల కోసం కాకుండా కేవలం స్వార్థం కోసం అధికారంలోకి రావడానికి కుట్రలు పన్నుతూ పార్టీలను దెబ్బతీస్తున్నాయన్నారు. ఇలాంటి స్వార్థ నేతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రాష్ట్ర నేతలు జగదీష్, రామాంజనేయులు, జాన్సన్ బాబు, జిల్లా నాయకులు నారాయణస్వామి, మల్లికార్జున, సంజీవప్ప, రాజారెడ్డి, కేశవరెడ్డి, శ్రీరాములు, గోపాల్, రామకృష్ణ, లింగమయ్య, రమణయ్య, పద్మావతి, రంగయ్య, సంతోష్, చిరంజీవి, రాజేష్, నాగరాజు, కల్లాయిస్వామి, చెన్నప్ప, వందలాదిమంది సీపీఐ శ్రేణులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

కేంద్ర మంత్రి సోమణ్ణకు టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం వినతి


కేంద్ర మంత్రి సోమణ్ణను కలిసిన టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం

అనంతపురం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రైల్వే సమస్యలు పరిష్కరించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్నను టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం కోరింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర మంత్రిని ఢిల్లీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎంపీలు బీకే పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, ఆయన సోదరుడు పరిటాల సిద్ధార్థ కలిశారు. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న రైల్వే సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ధర్మవరం నుంచి నాగసముద్రం మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చైనేజ్ 171-600 వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లెవెల్ క్రాసింగ్ గేటు ఏర్పాటు చేయకపోవడం మూలంగా ఇబ్బందులు తలెత్తడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవలే కేతిరెడ్డి కాలనీ వద్ద ప్రమాదాల్లో ఐదుగురు చనిపోయారన్నారు. ఈ పరిస్థితుల్లో వెంటనే అక్కడ లెవెల్ క్రాసింగ్ గేటుగానీ, ఫుట్ ఓవర్ బ్రిడ్జిగానీ ఏర్పాటు చేయాలని కోరారు. తమ ప్రాంత ప్రజలు తిరుపతికి వెళ్లేందుకు తీవ్ర వ్యవప్రయాసాలు పడుతున్న నేపథ్యంలో రామగిరి మార్గంలో కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. అనంతపురంలోని రాంనగర్, నాయక్‌నగర్‌లోని రైల్వే లైన్ క్రాస్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిలను నిర్మించాలని కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి చేశారు. తద్వారా ట్రాఫిక్ సమస్య తగ్గడంతోపాటు ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామిని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కలిశారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనపై చర్చించారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ ప్రాంతాలకు అత్యంత అనువుగా రవాణా మార్గం ఉన్న ఉమ్మడి అనంత జిల్లా పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రాంతమని కేంద్ర మంత్రికి వివరించారు. భూములు అధికంగా ఉన్న నేపథ్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు పరిశీలిస్తామని కేంద్ర మంత్రి.. ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్

విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ


విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్, పక్కన డీఎంహెచ్‌ఓ, ఐసీడీఎస్ పీడీ

అనంతపురం వైద్యం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్స వాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ అగస్టీన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నులిపురుగుల (ఆల్బెండజోల్) నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేసి మాట్లాడారు. ఆహారాన్ని తీసుకునే ముందుగా చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. విస్మరిస్తే గోళ్లలోని బ్యాక్టీరియా పొట్టలోకి చేరుకుని నులిపురుగుల నివాసానికి ఆవాసంగా మారుతుందని పేర్కొ న్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థుల శుభ్రతను పాటించేలా తగిన సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్‌డీడీ స్టేట్ నోడల్ ఆఫీసర్లు నరేష్, నాగేంద్ర మాట్లాడుతూ ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవడం ద్వారా నులిపురుగులు నశిస్తాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసుగల 599852మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగమణి, ఎంఈఓ వెంకటస్వామి, స్కూల్ హెడ్‌మాస్టర్ సుజాత, వైద్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ రోహిత్ నాయుడు, డెమో త్యాగరాజు, హెచ్‌ఈఓ గంగాధర్, ఎంహెచ్‌ఓలు రంగస్వామి, జగదీష్, మేనేజర్ రజిత, సైకాలజిస్ట్ సుందర్‌రావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు పరేడ్ పరిశీలన


మాట్లాడుతున్న ఎస్పీ జగదీశ్

అనంతపురం క్రైం, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌ను ఎస్పీ జగదీష్ మంగళవారం పరిశీలించారు. సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. సమర్థవంతంగా పరేడ్ నిర్వహించేలా సాయుధ బలగాలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జాతీయ సమైక్యత, దేశభక్తి భావం వెల్లివిరిసేలా పరేడ్ నిర్వహించాలన్నారు. ఏఆర్ సాయుధ బలగాలతోపాటు డాగ్‌స్క్వాడ్, ఎన్‌సీసీ విద్యార్థులు సైతం ప్రాక్టీస్ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నెట్టికంటి స్వామికి వెండి రథ

ప్రాకారోత్సవం


వెండి రథంపై స్వామివార్ల ఉత్సవ విగ్రహాలు

గుంతకల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా కసాపురంలోని శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం సీతారామ, లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాములకు వెండిరథంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. పూర్వాభాద్ర తిరునక్షత్ర సంక్రమణాన్ని పురస్కరించుకుని ఆలయ యాగశాలలో మన్యసూక్త హోమాన్ని నిర్వహించారు. స్వామివార్ల చిత్రపటాలను ఉంచి, వేదపండితులు హోమం చేశారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను వెండి రథంపై ఆసీనులు చేసి, ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయరాజు, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకుడు రాఘవాచారి, వేదపండితుడు రామకృష్ణావధాని పాల్గొన్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక చేశారు. ఎంపికైన జట్ల వివరాలను స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి మంగళవారం ప్రకటించారు. ఎంపికైన జట్లు ఈనెల 14 నుంచి తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో జరిగే 10వ ఏపీ జూనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో పాల్గొంటాయన్నారు.

బాలుర జట్టు: మనీష్, సంతోష్, సంజయ్‌రెడ్డి, చైత్రేష్, మనోజ్‌కుమార్, విజయ్, రాహిల్, సాయిహర్ష, లక్ష్మీనరసింహ, కౌషిక్, కరీం, ఖాజా ఎంపికయ్యారు. కోచ్‌గా అఫాశ్‌ఖాన్ నియమితులయ్యారు. బాలికల జట్టు: సోహానా, యామిని, నిక్కీశ్రీ, వైష్ణవి, పల్లవి, కిరణ్మయి, ధన్వి, పరిమళ, అజున, యశశ్విని, శ్రావణి, హర్షిత ఎంపికయ్యారు. కోచ్‌గా నరేంద్ర కృష్ణ నియమితులయ్యారు.

మున్సిపల్ ఆర్డీగా నాగరాజు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ)గా నాగరాజు నియమితుడయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర మున్సిపల్ డైరెక్టరేట్‌లో గ్రామ, వార్డు సచివాలయ అడిషినల్ డైరెక్టర్‌గా ఉన్న నాగరాజును అనంతపురం ఆర్డీగా నియమిస్తూ బదిలీ చేశారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న విశ్వనాథ్‌ను కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడ ఉన్న రవీంద్రబాబును ఇక్కడికి బదిలీ చేసినా ఆయన చేరలేదు. దీంతో నాగరాజును అనంతపురం ఆర్డీగా బదిలీ చేశారు. ఇంతకు మునుపు నాగరాజు అనంత నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేశారు. రెండు, మూడు రోజుల్లో ఆయన ఆర్డీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 17,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8,500, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 510 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.45

అనంతపురం రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మంగళవారం కిలో టామోటా లు గరిష్ఠంగా రూ.45తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.24, సరాసరిగా రూ.34తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

రూ.70వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు


డబ్బులు పోగొట్టుకున్న బాధితులు

లేపాక్షి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రూ.70వేలు కాజేసిన సంఘటన సోమవారం లేపాక్షిలో జరిగింది. బాధితులు ఇస్మాయిల్, రహమతి తెలిపిన మేరకు ఒక తెలియని నంబరు నుంచి మధ్యాహ్నం 3గంటల సమయంలో ఓ వ్యక్తి ఫోన్‌చేసి 'తాను ప్రభుత్వ అధికారిని అని, వెలుగు సంస్థ నుంచి మాట్లాడుతున్నానని, మీరు డ్వాక్రాలో తీసుకున్న వడ్డీ రుణం రూ.40వేలు మీ ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. మీ ఫోన్‌పేలో బ్యాలెన్స్ ఎంతుంది' అని అడిగాడు. ఇది నిజమని నమ్మి రూ.70వేలు ఉందని ఇస్మాయిల్ తెలిపాడు. మేము వడ్డీ డబ్బు ఖాతాలో జమ చేస్తున్నామని ఫోన్‌పే ఓపెన్ చేయమని అడిగాడు. నిజమని నమ్మి ఫోన్‌పే తెరిచాడు. అతను చెప్పిన విధంగా బ్యాలెన్స్ చెక్ చేసి, గంటను నొక్కాడు. దీంతో రూ.44,490 కట్ అయింది. మళ్లీ ఒకసారి గంటను నొక్కగా రూ.17,103 కట్ అయింది. మూడోసారి రూ.8,201కట్ అయింది. మీ ఖాతాలో మొత్తం డబ్బు రేపు జమ అవుతుందని చెప్పి సైబర్ నేరగాడు కాల్ కట్ చేశాడు. అనుమానంతో బాధితులు తిరిగి అదే నంబరుకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. మోసపోయామని గ్రహించిన బాధితులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. బాధితులు లేపాక్షిలో ఫుట్‌పాత్‌మీద బండిలో దోసెలమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. దంపతులకు నలుగురు ఆడపిల్లలు. ఇంటి మరమ్మతుల కోసం డ్వాక్రాలో లోన్ తీసుకుని ఖాతాలో పెట్టుకున్నామని, ఇలా మోసంతో మా సొమ్ము కాజేస్తారా అని భార్య భర్తలు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి


బెళుగుప్పలో నిర్వహిస్తున్న ర్యాలీ

బెళుగుప్ప, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకొని ఈ నెల 13, 14, 15 తేదీల్లో ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు దగ్గుబాటు సౌభాగ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వంద అడుగుల పొడవైనా జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఇందులో తహసీల్దార్ అనీల్ కుమార్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు, శ్రీనివాస, సన్‌రైజర్ విద్యానికేతన్ విద్యార్థులు పాల్గొన్నారు.

- కూడేరు : ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో జాతీయ జెండాను సర్పంచు లలితమ్మ ఎగురవేశారు. జాతీయ జెండా ప్రతి ఇంటా ఎగురు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏవో కేశవ, ఏపీఓ పోలేరయ్య పాల్గొన్నారు.
- కుందుర్పి : మండలంలోని కరిగానపల్లిలో జాతీయ జెండాను ఎంపీడీఓ లక్ష్మీ శంకర్, ఏపీవో మురళీధర్ టెక్నికల్ అసిస్టెంట్ రామాంజినేయులు, గ్రామస్థులు ఆవిష్కరించారు.
- కణేకల్లు : మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పేస్వామి, నాయకులు హీరోజీరావు, అరుణమ్మ, సత్యనారాయణ, మాల్యం విజయ్‌కుమార్, మల్లయ్యచౌదరి పాల్గొన్నారు.
- బొమ్మనహాళ్ : మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్ అమృత్ సర్వర్ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు.

సేవాఘడ్ గురుకులంలో ప్రవేశాలు

అనంతపురం విద్య, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): గుత్తి మండలం గొల్లలదొడ్డిలో ఉన్న సేవాఘడ్ గిరిజన గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా గిరిజన సంక్షేశాఖ డీడీ శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8, 9 తరగతులతోపాటు ఇంటర్‌లో సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఎస్టీ విద్యార్థులు అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీడీ కోరారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

ఫిడెల్ కాస్ట్రో (జయంతి)



క్యూబా దేశానికి చెందిన ఫిడెల్ కాస్ట్రో 1926 ఆగస్టు 13న జన్మించారు. క్యూబా దేశాన్ని 1959 నుంచి 2008 వరకు పరిపాలించిన అరుదైన రాజకీయ నేతగా, విప్లవ నాయకుడిగా గుర్తింపు పొందారు. క్యూబాను పశ్చిమార్థ భూగోళంలో మొట్టమొదటి సామ్యవాద దేశంగా మార్చాడు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ క్యూబాకు తొలి కార్యదర్శి. తన పాలనలో సామాజిక, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యత ఇచ్చాడు. నెల్సన్ మండేలా వాటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాడు. కాగా ఇతను అమెరికా దేశానికి వ్యతిరేకి. అమెరికా గూఢచార సంస్థ సీఐఏ కాస్ట్రోను హత్య చేయడానికి మొత్తం 638 సార్లు విఫలయత్నం చేసింది. 2016 నవంబరు 15న కన్నుమూశారు.

ఎస్ వరలక్ష్మి (జయంతి)



అలనాటి నటీమణి ఎస్ వరలక్ష్మి 1937 ఆగస్టు 13న జగ్గంపేటలో జన్మించారు. సత్య హరిశ్చంద్రలో చంద్రమతిగా, లవకుశలో భూదేవిగా ఆమె పోషించిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. తన పాత్రకు తానే పాటలు పాడుకునే ఆమె కంఠస్వరం పాతతరం ప్రేక్షకులకు సుపరిచితమే. తెలుగు సహా వీరపాండ్య కట్టబొమ్మన్, పణమా పాశమా, గుణ వంటి తమిళ సినిమాల్లో నటించారు. ప్రముఖ నిర్మాత ఏఎల్ శ్రీనివాసన్‌ను పెళ్లాడారు. కన్నాంబ ప్రోత్సాహంతో 1957లో సతీ సావిత్రి నిర్మించింది. సుమారు 500 సినిమాలలో నటించిన ఆమె కళైమామణి, శివాజీ గణేశన్ మెమోరియల్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2009 సెప్టెంబరు 22న కన్నుమూశారు.

శ్రీదేవి (జయంతి)



'తొలి ఫిమేల్ సూపర్‌స్టార్'గా పేరొందిన 'పద్మశ్రీ' గ్రహీత శ్రీదేవి 1963 ఆగస్టు 13న మద్రాస్‌లో జన్మించారు. తెలుగు, కన్నడ, తమిళం, మళయాళం, హిందీ భాషలలో నటించి గుర్తింపు పొందారు. అందం, అభినయం, నటనతో 1980, 90 దశకాలలో అగ్రశ్రేణి కథానాయికగా రాణించారు. నేషనల్ ఫిల్మ్ అవార్డు, నంది అవార్డు, నాలుగు ఫిల్మ్‌ఫేర్ అవార్డు, తమిళనాడు స్టేట్, కేరళ స్టేట్ అవార్డులు అందుకున్నారు. వరుసగా 15 సంవత్సరాలు బాక్సాఫీస్ రికార్డు సాధించిన ఘనత ఉంది. నిర్మాత బోనీకపూర్‌ను వివాహమాడారు. 54వ యేట 2018 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

టీకే మూర్తి (పుట్టినరోజు)




థాను కృష్ణమూర్తి 1924 ఆగస్టు 13న కేరళ రాష్ట్రంలోని నయతంగై గ్రామంలో జన్మించారు. ఎటువంటి శిక్షణ లేకుండా 8వ యేటనే మృదంగ వాద్యంపై ప్రతిభ చాటారు. 15వేలకుపైగా కచేరీలలో మృదంగంపై సహకారం అందించారు. త్రివేంద్రం ప్యాలెస్‌కు ఆస్థాన విద్వాన్‌గా వ్యవహరించారు. పద్మశ్రీ, సంగీత కళానిధి, కేంద్ర సంగీత నాటక అకాడమీ వారి ఫెలోషిప్ సహా పలు పురస్కారాలు అందుకున్నారు. ప్రసారభారతిలో జాతీయ కళాకారుడిగా కొనసాగారు.

వైజయంతిమాల (పుట్టినరోజు)



పద్మవిభూషణ్ గ్రహీత వైజయంతిమాల పాత తరం తెలుగు, తమిళ సినిమా నటి 1936 ఆగస్టు 13న చెన్నైలో జన్మించారు. హిందీ చిత్రరంగంలో ప్రవేశించి మంచి పేరు పొందారు. భరతనాట్య కళాకారిణిగాను, గోల్ఫ్ క్రీడాకారిణిగాను రాణించారు. 1950, 60 దశకాలలో పలు సినిమాలలో నటించి అనేక అవార్డులు పొందారు. తర్వాత పార్లమెంటు సభ్యురాలిగాను కొన సాగారు. సంగీత నాటక అకాడమీ, పద్మశ్రీ పురస్కారం, 5 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఇతర గౌరవాలు అందుకున్నారు.

సాత్విక్ సాయిరాజ్ (పుట్టినరోజు)



వర్ధమాన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి 2000 ఆగస్టు 13న అమలాపురంలో జన్మించారు. పురుషుల డబుల్స్‌లో చిరాగ్ శెట్టితో సత్తా చాటాడు. కామన్వెల్త్ 2018 లో మిక్స్‌డ్ టీమ్‌లోనూ, 2022 కామన్వెల్త్‌లో పురుషుల డబుల్స్‌లో స్వర్ణ పతకాన్ని సాధించాడు. 2023 దుబాయ్‌లో ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో స్వర్ణపతకం సాధించారు. అర్జున అవార్డు, ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న సహా ఇతర గౌరవాలు అందుకున్నారు. 565 కిమీ/గంటకు వేగానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అందుకున్నారు.

పతాకాన్ని పట్టించుకోరూ..!

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ పండుగలైన స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వస్తున్నాయంటేనే... జాతీయ జెండాలు ఏర్పాటు చేసిన ధ్వజ స్థంభం నిర్వహణ చేయాలంటేనే విజయనగర జిల్లా యంత్రాంగానికి కత్తిమీద సాములా మారుతోంది. విజయగనర జిల్లా కేంద్రమైన హొసపేట నగరంలో పునీత్ రాజ్ కుమార్ జిల్లా స్టేడియంలో ఏర్పాటు చేసిన దేశంలో ఎత్తైన జాతీయ పతాక స్థానంలో రెండో స్థానం ఆక్రమిస్తున్న హొసపేట నగరంలో ఉన్న జాతీయ పతాకం ఎత్తు 405 అడుగులు ఉండడం గమనార్హం. ఇంత ఎత్తులో జాతీయ పతాకం ఏర్పాటు చేయడం జిల్లా యంత్రాంగానికి జాతీయ జెండా ధ్వజస్థంభం నిర్వహణ మోయలేని భారంగా తయారైంది. గత ఏడాది జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిపై జాతీయ పతాకం, తాడు పడిపోవడం జాతీయ పతాక నిర్వహణపై అధికారులపై మంత్రి సమీర్ అమ్మద్ ఆగ్రహానికి లోను కావడంతో సంబంధిత కాంట్రాక్టరుపై కేసు నమోదు చేశారు. అయితే అప్పటి నుంచి కేసులో ఎలాంటి పురోగతి కనిపించలేదు. దీంతో పాటు 405 అడుగుల ఎత్తులో ఉన్న ధ్వజస్థంభంపై విద్యుత్ దీపం వెలిగించడం సాధ్యం కావడం లేదు. ఎపుడూ ధ్వజస్థంభంపై విద్యుత్ దీపం వెలిగి ఉండాలి... లేకపోతే ప్రమాద వశాత్తు ఆకాశ మార్గాన వెళ్ళే హెలికాప్టర్‌లు ఢీ కొనే ప్రమాదం ఉందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. మున్సిపల్ కౌన్సిల్ ఇటీవల ఆమోదించిన తీర్మానంలో జాతీయ జెండా నిర్వహణ పనులను జిల్లా ప్రజా పనుల శాఖకు అప్పగించాలని తీర్మానం తీసుకున్నారు. ఇది సాధ్యం కాదని మున్సిపల్ కౌన్సిల్‌కు తిరిగి ప్రజా పనుల శాఖ అధికారులు లేఖ రాశారు. ప్రస్తుతం ఎత్తైనా ధ్వజ స్థంభం ఏర్పాటు చేసిన వారు ప్రతిష్ఠగా భావిస్తున్నా, ధ్వస్థంభం చూసి ఓట్లు వేసే పరిస్థితి లేదని తెలిసిపోయింది. మైదానం మధ్యలో భారీ ఎత్తులో జాతయ పతాక ధ్వజం ఏర్పాటు చేసి పతాకం ఎగిరినా... బృహత్ సమావేశాలు, సమారాంభాలకు జాతీయ పతాక ధ్వజ స్థంభం అడ్డుగా ఉందని హొసపేట ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత మూడు సంవత్సరాల నుండి పరిస్థితి గమనిస్తూ వస్తున్న ప్రజలు ప్రస్తుతం ఇంత పెద్ద ప్రమాణంలో ఉన్న జాతీయ ధ్వజ స్థంభం నిర్వహణ బాధ్యతలు ఎవరు చేపట్టాలనే విషయం ప్రజలను వెంటాడుతోంది. నిర్వహణ లేక ధ్వజస్థంభం ద్వారా ఎలాంటి ప్రమాదం జరిగితే ప్రతిష్ఠించిన వారికి అవమానంతో పాటు ప్రజలకు ముప్పు తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ధ్వజ స్థంభాన్ని మైదానంలో ఒకవైపున ఉంచాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నా.. ఇప్పట్లో ఆ పని సాధ్యమని కాదనిపిస్తోంది. భారీ ప్రమాణంలో ఉన్న జాతీయ జెండా ధ్వజ స్థంభం నిర్వహణ కష్టమైతే స్థంబాన్ని తొలగించడమే ఏకైక మార్గని.... ఒక వేళ తొలగించడం ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందంటే... నిర్వహణ భారాన్ని ఎవరైనా భరించాల్సి ఉంది.. ఇందులో ఏదో ఒకటి జరిగితే తప్పా... సమస్యకు పరిష్కారం కాదని కొంతమంది విజ్ఞానులు అభిప్రాయ పడుతున్నారు.

భారమైన ధ్వజ స్తంభం నిర్వహణ

పర్యాటక శాఖ నిధుల క్రింద రూ 5.17కోట్ల వ్యయంతో 2022-23 సంవత్సరంలో నిర్మించిన ఈ జెండా ప్రస్తుతం జిల్లా యంత్రాంగానికి తెల్ల ఏనుగుగా మారిందని చెప్పవచ్చు. ఎత్తైన ధ్వజ స్థంభానికి అనుగుణంగానే పతాకాన్ని ఎరుగ వేయాల్సి ఉంటుంది. లేక పోతే ఆకారం కోల్పోయే అవకాశం ఉంది. సంవత్సరంలో నాలుగు సార్లు జాతీయ పతాకాన్ని ఎగుర వేయాల్సి ఉంటుంది. అందుకు బెంగళూరు నుంచి నిపుణులను తీసుకురావాల్సి ఉంటుంది. కొన్ని సందర్భంలో బృహత్ ధ్వజానికి బదులుగా తక్కు ఎత్తులో ఎగుర వేసి జాతీయ పండుగలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొనడం విశేషం.

వెనుదిరిగిన నిపుణులు...

బృహత్ స్థాయిలో ఏర్పాటు చేసిన జాతీయ జెండా ధ్వజం నిర్వహణపై ప్రజల్లో వస్తున్న ఆరోపణల నేపథ్యంలో శనివారం ఎట్టకేలకు నగరసభ కమీషనర్ ఎ.శివకుమార్ నిపుణుల చేత పరిశీలన జరిపింది. ధ్వజ స్థంభాన్ని పరిశీలించిన బృందం ఎట్టకేలకు అసాధ్యమని తేల్చింది. 405 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్‌ను ఏర్పాటు చేయాలంటే అంతే స్థాయిలో క్రైన్‌ను ఉపయోగించాల్సి ఉంటుందని, అందుకు సుమారు రూ 25లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇప్పటికిప్పుడు అంతమొత్తంలో ఖర్చు చేయాలంటో సర్వ సభ్యుల ఆమోదం కావాల్సి ఉంటుందని, రెండు మూడు లక్షల అయితే నగరసభ నిధుల నేరుగా ఖర్చు చేసే అవకాశం ఉందని కమీషనర్ అభిప్రాయం వ్యక్తం చస్తున్నారు. ఈ సారి జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు బృహత్ ధ్వజారోహణ జరిగే అవకాశం లేదని, చిన్న ధ్వజస్థంభంపైనే జాతీయ పతాకాన్ని ఎగుర వేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధన



పురవీధుల్లో రథోత్సవం

శిడ్లఘట్ట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్తూరు వీధిలో కొలువైన రాఘవేంద్ర స్వామి మఠంలో 354వ ఆరాధనా మహోత్సవం మూడు రోజులపాటు వైభవంగా జరిగింది. పూర్వారాధన, మధ్యారాధన, ఉత్తరారాధన కార్యక్రమాలు ఆది, సోమ, మంగళవారాలలో జరిగాయి. తొలిరోజు సుప్రభాతసేవ, పంచామృ తాభిషేకం, సహస్రనామార్చన, హస్తోదకం, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రెండోరోజు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ఉత్సవ మూర్తికి విశేష అలంకరణ చేశారు. గాయత్రి మహిళామండలి సభ్యులచే భక్తి గీతాలాపన, శ్రీకాంతం నాగేంద్రశాస్త్రి, ఆనూరు అనంతకృష్ణశర్మ బందంచే శాస్త్రీయ సంగీత కార్యక్రమం జరిగింది. ఆలయ ఆవరణలో రాఘవేంద్ర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక అన్నసంతర్పణ నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షులు నాగరాజరావ్, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి మధుసూదన్, ట్రస్టీలు వాసుదేవరావ్, రవి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. మూడురోజులపాటు మఠంలో సంబరంగా కార్యక్రమాలు సాగడంతో భక్తుల సందోహం నెలకొంది.

ఆలయ భూమి కంచె ధ్వంసం



దెబ్బతిన్న ప్రహరీని చూపుతున్న గ్రామస్థులు

చింతామణి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చింతామణి తాలూకా ఊలవాడి హోబళి గ్రామపంచాయతీ పరిధి భూరగమాకలహళ్ళిలోని ఆలయానికి అనుబంధమైన మారుతిసేవా ట్రస్టుకు చెందిన భూమికి అమర్చిన కంచెను రాత్రికి రాత్రి కొందరు దుండగులు ధ్వంసం చేశారు. ప్రహరీగా అమర్చిన రాళ్లను, సిమెంటు స్తంభాలను నాశనం చేశారు. ఇలా సుమారు 3లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. సోమవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనపై ఆలయానికి చెందిన మారుతిసేవా ట్రస్టు పదాధికారులు చింతామణి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే 58/2లో 2.19 గుంటల భూమిని జిల్లా అధికారి కార్యాలయం ఆదేశాల మేరకు, జిల్లా సాంకేతిక సహాయకులు, భూ రికార్డుల డిప్యూటి డైరెక్టర్ కోర్టు చిక్కబళ్ళాపుర ఆదేశాలతో ప్రహరీని నిర్మించారు. సదరు సర్వేభూమికి రక్షణగా రాళ్లతో అడ్డుగోడ, చుట్టూ చెయిన్‌లింక్‌మెష్ అమర్చారు. ఆస్తి పక్కనే ఉన్న భూయజమానులు నందీశ్, శ్రీనివాసరెడ్డి, మంజునాథరెడ్డి, అశోకరెడ్డి, ప్రకాశరెడ్డి, అరవింద్, పవన్‌లు ఉద్దేశ్యపూర్వకంగా అడ్డుగోడను తొలగించారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రహదారి పనులు ఎప్పటికి పూర్తయ్యేనో..?



గుంతలమయమైన ప్రధాన రహదారి

సిరుగుప్ప, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రహదారి 150 అభివృద్ధికి నోచుకునేది ఎన్నడో అని ప్రజలకు ప్రశ్నార్థకంగా మారింది. సిరుగుప్ప తాలుకాలోని టెక్కలకోట పట్టణం నుంచి దడే సూగూరు గ్రామం వరకు 150 రహదారి నిర్మాణ పనులకు 118 కోట్లు నిధులు విడుదలై మూడేళ్లు గడుస్తోంది. ఈ 11 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేయడంలో రహదారుల శాఖ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. 11 కిలోమీటర్లుకు కనీసం మూడు కిలోమీటర్లు కూడా రోడ్డు పూర్తి కాలేదు. ఎక్కడపడితే అక్కడ గుంతలు, మట్టి రోడ్లు, దర్శనమిస్తున్నాయి. ఇక వర్షం వస్తే రోడ్లంతా చిత్తడిగా మారుతోంది. న్యాయవాది సంఘం, జాతీయ పార్టీలు, లెఫ్ట్ పార్టీలు ఈ విషయంపై ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం మాత్రం అంతంత మాత్రంగా వుంది. ఈ రహదారిలో అనేక రోడ్డు ప్రమాదాలు కూడా సంభవించాయి. జాతీయ రహదారి విజయనగరంలో వుండే శాఖ అధికారులు ప్రజలు అడిగినప్పుడు నామమాత్రంగా పనులు చేయడం కాంట్రాక్టర్లు స్పందించడం లేదని సాకులు చెప్పడం జరుగుతోంది. వారం రోజుల క్రితం పీడబ్ల్యూడీ శాఖ మంత్రి సతీష్ జార్కిహోళి కాంట్రాక్టర్‌పై కేసులు నమోదుచేయాలని ఆదేశించినా పనులు మాత్రం జరుగలేదు. ఈ రహదారి అభివృద్ధికి నోచుకునేదెన్నడు.. ప్రజలకు ప్రమాదాలు తప్పేది ఎన్నడోనని ఆవేదన చెందుతున్నారు.

స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పనిచేయండి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప



మాట్లాడుతున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నాయకులు కార్యకర్తలు అందుకు సన్నద్ధంగా పనిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పంక్షన్ హాలులో హిందూపురం రూరల్ మండల టీడీపీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైసీపీ నాయకుల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామని, ఈ విషయంపై ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కన్వీనర్ రాము, వాల్మీకి కార్పోరేషన్ డైరెక్టర్ ఆనంద్, నాయకులు అరుణాచలరెడ్డి, శ్రీరామప్ప, మంజునాథ్, హనుమంతు, చిక్కీరప్ప, రామాంజి, ఉమా శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చడం దారుణం: జేడీఎస్

పావగడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కుమారస్వామి లేఅవుట్‌గా ఉన్న ప్రాంతాన్ని వెంకటరమణప్ప లేఅవుట్‌గా నామకరణం చేయడాన్ని జేడీఎస్ నాయకుల తప్పుపట్టారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2007లో కుమారస్వామి లేఅవుట్‌గా నామకరణం చేసిన ప్రాంతానికి పేరుమార్చడం తగదన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ పేరు మార్చరాదన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పేవీరన్న, కృష్ణప్ప, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

సజావుగా సర్వసభ్య సమావేశం

అమరాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ముఖ్య అతిథిగా ఏపీఎంసీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్ పాల్గొని స్థానిక నాయకుల నుంచి ఎదురైన సమస్యలకు పరిష్కారం సూచించారు. ఎంపీటీసీ వంకరస్వామి రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలున్నాయని, వాటిని దూరంగా ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలు విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయని, దానిని కట్టడి చేయాలన్నారు. అందుకు తగ్గ చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఏఈ సిద్ధేశ్వర తెలిపారు. ఏడాదిన్నర్ర కాలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎన్ని పంపిణీ చేశారని అడగ్గా 240 దరఖాస్తులు వచ్చాయని, 80 పంపిణీ చేసినట్లు వివరించారు. దీనిపై స్వల్ప వాగ్వాదం చోటుచేసుకోగా నాయకుల జోక్యంతో సద్దుమణిగింది. సభ్యులు లేవనెత్తి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.



సమావేశానికి హాజరైన అధికారులు, నాయకులు

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే మా ఆశయమని రెప్కో బ్యాంకు చైర్మన్ సంతానం అభిప్రాయపడ్డారు. రాజాజినగర్‌లో మంగళవారం బ్యాంకు నూతనశాఖను ప్రారంభించారు. ఈడీ ఓఎం గోకుల్, జనరల్ మేనేజర్ కుమరేశన్, ఏజీఎం ఎన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. సంతానం మాట్లాడుతూ 1969లో బ్యాంకు స్థాపన అయ్యిందని ఐదు దశాబ్దాలుగా వినియోగదారులకు సమగ్రమైన సేవలు అందిస్తున్నారన్నారు. గత ఏడాదికి 21,146 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయని, 140 కోట్ల నికరలాభం సాధ్యమైందన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

» గవర్నర్, మంత్రి హెబ్బాళ్కర్ సంతకాలు ఫోర్జరీ

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శిశుసంక్షేమశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని 14మంది నుంచి రూ.30లక్షలదాకా వసూలు చేసి మోసానికి పాల్పడిన వ్యక్తిని గుర్తించినట్లు బెళగావి జిల్లా ఎస్పీ భీమాశంకర్ గుళేద్ తెలిపారు. గవర్నర్, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌తోపాటు ఆమె వ్యక్తిగత కార్యదర్శి సంతకాలను నిందితుడు మంజునాథ్ మల్లసర్జ ఫోర్జరీ చేశారన్నారు. మంత్రికి సంబంధించిన లెటర్‌హెడ్‌లను ఉపయోగించినట్లు మంగళవారం మీడియాకు తెలిపారు. మోసపోయిన కావ్య అనే యువతి ఫిర్యాదు చేసిన మేరకు అవినీతి వెలుగులోకి వచ్చిందన్నారు. అతడిని అరెస్టు చేయలేదని, అయితే ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడని ఎస్పీ తెలిపారు. కాగా సోషల్ మీడియాలో ఈ అవినీతి వెనుక మంత్రి వ్యక్తిగత కార్యదర్శి సోమనగౌడ కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యావజ్జీవ శిక్ష రద్దు... 13ఏళ్ల తర్వాత విడుదల

బెంగళూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ధర్మాసనం మంగళవారం సంచలనమైన తీర్పునిచ్చింది. 2011లో జరిగిన ఓ వ్యక్తి హత్య కేసులో మైనరుపై వయసు ఎక్కువగా ఉందని పరిగణించి యావజ్జీవ కారాగారశిక్ష విధించారు. సెషన్స్ కోర్టు విధించిన యావజ్జీవశిక్షను హైకోర్టు ధర్మాసనం రద్దు చేసింది. 13ఏళ్లు శిక్ష అనుభవించిన తర్వాత విడుదల చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అతను చేసిన నేరానికి శిక్ష విధించడం సరైనదే అయినా... మైనరు కావడంతో బాల నేరస్తుడిగా శిక్ష రద్దు పరిచి రూ.50వేల జరిమానా చెల్లించాలని సూచించారు. తన సోదరి భర్తను తుపాకీతో కాల్చి హతమార్చిన కేసులో యాదగిరి జిల్లా చన్నప్ప దాఖలు చేసిన పిటీషన్‌ను న్యాయమూర్తులు సునిల్‌దత్ యాదవ్, రామచంద్ర డి హుద్దార్‌ల ధర్మాసనం విచారణ జరిపింది.

రేపు పురానికి బాలకృష్ణ

● పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

హిందూపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నియోజకవర్గ పర్యటనలో భాగంగా గురువారం హిందూపురానికి రానున్నారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం చిలమత్తూరు మండలం టేకులోడు గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించిన ల్యాబ్, వసతి గృహాలను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడ నుంచి హిందూపురం మండలం పూలకుంటలో సూర్యాఘర్ పథకంలో భాగంగా ఇంటిపై సోలార్ ప్లాంట్‌ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంని ప్రారంభిస్తారు. సాయంత్రం హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు, ఇంజనీర్లతో సమీక్ష, సూరప్పకుంట సుందీకరణపై జిల్లా అటవీశాఖ అధికారులతో సమావేశం, నియోజకవర్గంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై సంబంధిత రెవెన్యూ అధికారులతో సమీక్ష జరపనున్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఎంజీఎం క్రీడామైదానంలో 79వ స్వాసంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం ఆర్టీసి బస్టాండులో సూపర్ సిక్స్ పథకాల అమల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో భాగంగా స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభిస్తారని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి: ఏఓ

సోమందేపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు సంబంధించి ప్రతిరైతు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదుచేసుకోవాలని ఏఓ విజయభారతి పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండ్రాయనపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. పంట నమోదు చేసుకోవడంవల్ల ఇన్సురెన్స్, ఇన్‌పుట్‌సబ్సిడీ, విత్తన కొనుగోలు తదితర లాంటి పథకాలు పొందవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ కోసం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌ను లింక్ చేసుకోవాలన్నారు. వరిపంట సాగుచేసినవారు ఈనెల 15లోపు ఇన్సురెన్స్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హరిక్రిష్ణ, ఏఈఓ అలైఖ్య, ఎంపీఈఓ హరీష్, ధనుంజయ, రైతులు పాల్గొన్నారు.

'రాజకీయ కక్షతో పదవి నుంచి తొలగించారు'

పావగడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షతోనే మంత్రి రాజన్నను మంత్రి పదవి నుంచి తొలగించారని వాల్మీకి సంఘం నాయకులు అన్నారు. మంగళవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వాల్మీకి సంఘం నాయకులు సమావేశమయ్యారు. రాజన్నకు మద్దతుగా బుధవారం తుమకూరులో నిరసనను చేపడుతున్నామన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజన్న ఎంతో సేవ చేశారన్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించాలన్నారు. అటువంటి నాయకుడిని మంత్రి పదవి నుంచి తొలగించడం బాధాకరమన్నారు. నిరసనకు వాల్మీకి సంఘం నాయకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నిడుగల్ వాల్మీకి పీఠాధిపతి సంజయ్‌కుమారస్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పరిగి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జమేదారు గంగరాజు, సునీల్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం గార్మెంట్స్ వద్ద ఆటోడ్రైవర్లకు పలు సూచనలు చేశారు. అతి వేగం, సౌండ్‌సిస్టమ్, అధికమంది ప్రయాణికులతో ప్రయాణిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌సీలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ మృతి

గోరంట్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలివాండ్లపల్లికి చెందిన బెల్దారి చాకలి శ్రీనివాసులు (32) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసులు అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వివరించారు. కాగా టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణీ, సర్పంచ్ భర్త అశ్వర్థరెడ్డి తదితరులు ఆయన మృతికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,630.97
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	21,910	25,571
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	21,705	99,567
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	97.75

కేఎంఎఫ్ లాభాల బాట పట్టేనా..?

● కొత్త అధ్యక్షుడు హిట్నాళ్‌పైనే ఆశలు ● మాజీ అధ్యక్షుడు భీమానాయక్ పాలనలో రూ.7కోట్ల నష్టాలు



కేఎంఎఫ్ అధ్యక్షుడు రాఘవేంద్ర హిట్నాళ్



కేఎంఎఫ్ నుంచి పాలు తరలిస్తున్న ట్యాంకర్లు

బళ్లారి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర (రాబకోవి) జిల్లాల పరిధిలో ఉన్న కర్నాటక పాల ఉత్పత్తి సమాఖ్య (కేఎంఎఫ్) నష్టాల్లో మునిగి పోయింది. నాణ్యత ప్రమాణాలు, పాడి రైతులకు అండగా, పాల ఉత్పత్తి, సేకరణలో ఎంతో గొప్ప పేరు ఉన్న కేఎంఎఫ్ 2019 నుంచి నష్టాల్లోనే కూరుకుపోయింది. 2019-20 వరకూ రూ. 6 లాభాల్లో ఉన్న కేఎంఎఫ్. వార్షిక లెక్కల ప్రకారం రూ. 7 కోట్లా 20 లక్షల నష్టాల్లోకి జారుకుంది. దీనికి ప్రధాన కారణం తాజా మాజీ అధ్యక్షుడు బీమానాయక్ నిర్ణయాలే కారణమని ఉద్యోగులు బహిరంగా విమర్శస్తున్నారు. డైరెక్టర్లతో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం, కనీసం కమిటీ సమావేశంలో సభ్యులు వ్యతిరేకించిన బయటకు రాకుండా చేయడం, పాలసేకరణలో అవకతవకలే నష్టాలే కారణమని కొందరు డైరెక్టర్లు విమర్శిస్తున్నారు. పాలల్లో నీరు కలిపి కల్తీ చేయడం, చిక్కదనం కోసం పౌడర్ కలపడం, ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలు కూడా టెండర్ పిలవకుండా తన అనుకూల వ్యక్తులకు ఇచ్చారని కొందరు డైరెక్టర్లు ఇటీవల జరిగిన సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాడు ఏకపక్ష నిర్ణయాలతో తీవ్ర నష్టాలు

బీమానాయక్ సీఎం సిద్దరామయ్యకు కీలక అనుచరుడే, ఆయన అధ్యక్ష పదవి స్వీకరించాక అన్నీ తానై వ్యవహరించారు. 2022లో బళ్లారిలో మెగా మిల్క్ డైయిరీ మంజూరు అయింది. దాన్ని బళ్లారిలో కాకుండా ఇతర ప్రాంతంలో నెలకొల్పాలని తీవ్ర ప్రయత్నం చేశారు. బళ్లారిలోనే మినీ మిల్క్ డైయిరీ స్థాపించాలని మాజీ డైరెక్టర్ దనుంజయ, ఇతర డైరెక్టర్లు చాలా మంది పట్టుపట్టారు. అయినా బీమానాయక్ పెడచెవిన పెట్టారు. తానే తిరిగి కేఎంఎఫ్ అధ్యక్షుడు ఔతానని బీమానాయక్ గట్టిగా భావించారు. రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయనగర జిల్లాలో డైరెక్టర్ల ఎన్నికల్లో కూడా ఆయనే తానే వ్యవహరించారు. ఇక్కడే ఆయన కథ రివర్స్ అయ్యింది. ఈ నాలుగు జిల్లాలో ఎమ్మెల్యేలను ఏమాత్రం సంప్రదించకపోవడంతో కొందరి కోపానికి దారి తీసింది. కొప్పళలో ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాళ్ ను సంప్రదించకుండా కేఎంఎఫ్ డైరెక్టర్లను ఎంపిక చేసుకోవాలని చూశారు. దీంతో తన నియోజకవర్గంలో ఆయన పెత్తనమేంటని మండిపడ్డారు. పైగా హిట్నాళ్‌తో నువ్వానేనా అనేదాకా వివాదం సాగింది.

అందరూ ఏకమై అధ్యక్ష పదవి సాధించారు

భీమానాయక్‌పై కోపంతో బళ్లారి నేతలు చాకచక్యంగా పావులు కదిపారు. పైగా కొప్పళ ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్ కూడా సీఎం సిద్దరామయ్యకు అత్యంత సన్నిహితుడు, అదే సామాజిక వర్గానికి చెందినవారు. దీంతో కేఎంఎఫ్ అధ్యక్ష పదవి సునాయాసంగానే దక్కింది. మాజీ డైరెక్టర్ ధనుంజయ, మాజీ మంత్రి నాగేంద్ర, బళ్లారి సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి బళ్లారిలోనే మెగా డెయిరీకి ఏర్పాటుకు పట్టుపట్టారు. కేఎంఎఫ్ డైరెక్టర్‌గా ప్రభుత్వం తరుపున ఒకరిని ఎన్నుకునే అవకాశం ఉంది. అప్పటి వరకూ ప్రభుత్వ తరుపున కేఎంఎఫ్ డైరెక్టర్‌గా ఉన్న ధనుంజయ స్థానంలో ఊహించని విదంగా రాఘవేంద్ర హిట్నాల్‌ను కెఎంఎఫ్‌లో ప్రభుత్వ డైరెక్టర్‌గా ఎన్నుకున్నారు. తరువాత డైరెక్టర్లు అంతా కలిసి అధ్యక్షున్ని ఎన్నుకున్నారు. కేఎంఎఫ్‌లో దాదాపు నాలుగేళ్ల పాటు ఏకచత్రాధిపతిగా వెలిగిన బీమానాయక్ ఒకే ఒక్క నెలలో ఖంగు తినిపించారు.



మాజీ అధ్యక్షుడు భీమానాయక్

మెగా మిల్క్ డెయిరీ స్థాపనకు అడుగులు

కేఎంఎఫ్ కొత్త అధ్యక్షుడిగా రాఘవేంద్ర హిట్నాల్ బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే బళ్లారిలో మెగా మిల్క్ డెయిరీ స్థాపనకు శ్రీకారం చుట్టారు. రూ. 145 కోట్లుతో మెగా డైయిరీ స్థాపనకు కొలగల్లు వద్ద స్థలం పరిశీలించారు. ఇది కొత్తగా ఏర్పడిన కేఎంఎఫ్ బాడీ కొత్త విజయం అని అందరూ చర్చించుకుంటున్నారు. నష్టల బాట నుంచి కేఎంఎఫ్‌ను ఎలా లాభాల్లోకి తేవాలో అనేది కమిటీతో కొత్త అధ్యక్షుడు చర్చలు సాగిస్తున్నారు. అధికారులు, రైతులు, కమిటీ సభ్యులు అందరూ కలిసి ఆలోచనలు చేసి సమాఖ్య అభివృద్ధిపై దృష్టి పెడుతున్నారు. జిల్లా రైతులు కూడా కేఎంఎఫ్ అభివృద్ధిపైనే ఆశలు పెంచుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మిశ్రా

మానవతా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి: కలెక్టర్

బళ్లారి సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విపత్తులు, సంఘర్షణలలో చిక్కుకున్న ప్రజలకు సహాయం చేయడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టే మానవతా వాద కార్యకర్తల కృషిని గౌరవించి, గుర్తుంచుకోవడానికి ఆగస్టు 19న ప్రపంచ మానవతా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వారిని గుర్తించుకోవడం అందరి భాధ్యత అని జిల్లావిపత్తు నిర్వహణ అథారిటీ ఛైర్మన్ జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కేశ్వన్ వీడియో ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ సమావేశానికి ఆయన అద్యక్షత వహించి మాట్లాడారు. మానవత్వంలోని వివిధ అంశాలను వెలుగులోకి తీసుకురావడం, మానవతావాద కార్యకర్తల పనిని గుర్తించడం,గౌరవించడం అందరి కర్తవ్యమన్నారు. దీంతో మరింత మంది సేవా కార్యక్రమాలకు ముందుకు వస్తారన్నారు. కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు.

భారీ వర్షాలతో కూలిన 16 ఇళ్లు

మూడు రోజులుగా జిల్లాలో భారీవర్షాలు కురుస్తున్నాయని, సండూర్ తాలూకా మినహా మిగిలిన తాలూకాలోని వివిధ ప్రదేశాల్లో 16ఇళ్లు దెబ్బతిన్నాయని జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ అధికారులు సమావేశంలో తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అధికారులు సందర్శించి తగిన పరిహారం అందించేలా చూడాలన్నారు. వచ్చేవారం వర్షాలు మరిన్ని కురిసే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు. తుంగభద్ర జలాశయంలోకి పెద్ద మొత్తంలో నీరు ప్రవహించే అవకాశం ఉందని, నదీ తీర ప్రాంత తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర విపత్తు సహాయ నిది కింద చేపట్టిన వివిధ పనులను వేగవంతం చేయాలని నిర్ణీత గుడువులోగా వాటిని పూర్తి చేయడానికి అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. ఈసందర్భంగా అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్ జుబేర్, అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్, డీడీఎల్ఆర్ అధికారులు ,అన్ని తాలూకా తహసీల్దార్లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ రిహార్సల్

బళ్లారి సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని విమ్స్ మైదానంలో ఆగస్టు 15న జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ ప్రజా కార్యక్రమానికి సంబందించిన రిహార్సల్స్ మంగళవారం నిర్వహించారు. ఉదయం డీఏఆర్ డీవైఎస్పీ నేతృత్వంలో పోలీసులు, ఎన్‌సీసీ , హోంగార్డులు, పాఠశాల పిల్లలు మైదానంలో కవాతు ఊరేగింపు నిర్వహించారు. జెండాప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నేడు కౌన్సెలింగ్

రొళ్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొమ్మరహట్టి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్ల భర్తీకి బుధవారం కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు



యూరియా కోసం సొసైటీ ముందు క్యూలో నిల్చున్న రైతులు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో యూరియా కొరత రైతులను పట్టిపీడిస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా...ఇంతవరకు రైతులకు అవసరమైన యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలమైందనే ఆరోపణలు రైతు వర్గాల నుంచి వినిపిస్తోంది. కొప్పళ నగరంలో యూరియా కోసం ఏకంగా ఒక కిలోమీటరు పొడవునా క్యూకట్టడం చూస్తుంటే జిల్లాలో యూరియా కొరత, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను అద్దం పడుతోంది. కొప్పళ నగరంలోని బసవేశ్వర సర్కిల్ వద్ద ఉన్న సహకార సంఘం ముందు రైతులు సోమవారం తెల్లవారు జామున నుండే వేచి చూస్తున్న దృశ్యం రైతుల కష్టానికి తాత్కాణంగా నిలుస్తోంది. రైతుల భూములకు చెందిన పహణీ, ఆధార్ కార్డు తప్పని సరి కావడంతో కిలోమీటరు పొడవులు వేలాది మంది రైతులు క్యూకట్టడం అందరిని ఆశ్చర్య పరిచింది. పెద్ద ఎత్తున రైతులు ఒకే చోట చేరడంతో శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసులు రైతులను అదుపు చేయాల్సి వచ్చింది.

నిజాయతీ చాటుకున్న హోంగార్డు

కంప్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక క్షేత్రం హంపిలో ఓ భక్తుడు పోగొట్టుకున్న పర్సును అందజేసి హోంగార్డు నిజాయితీ చాటుకున్నారు. మంగళవారం రాయచూరు పట్టణానికి చెందిన రమేష్ హంపి పుణ్య క్షేత్రానికి దర్శించుకోవడానికి వచ్చారు. హంపిలో విరుపాక్షేశ్వర పార్వతి భువనేశ్వరి దర్శించుకుని తిరిగి బయల్దేరే సమయంలో పర్సు పోగొట్టుకున్నట్లు గుర్తించారు. స్థానికులను ఆరా తీస్తుండగా హోమ్‌గార్డ్ భాష, శివరాజ్ తమకు పర్సు దొరికిందని భక్తుడికి అప్పగించారు. తన పర్సులో నగదుతో పాటు విలువైన కార్డులు ఉన్నాయని భక్తుడు హర్షం వ్యక్తం చేశారు.



బాధితుడికి పర్సు అప్పగిస్తున్న హోంగార్డు

చలవాది సమాజానికి రిజర్వేషన్ కల్పించాలి



ఆందోళనలో చలవాది సమాజ సభ్యులు

బళ్లారిరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చలవాది కులానికి ఆరు శాతం రిజర్వేషన్ కల్పించాలంటూ మంగళవారం ఉదయం కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ చలవాది సమాజానికి ఆరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. మహాసభ జిల్లా కమిటీకి సంబంధించి సర్వే నిర్వహించాలని ముఖ్యమంత్రి సిద్ద రామయ్యకు అందించాలని చలవాది కుల బాంధవులు మనవిపత్రం అందించారు. జనాభా లెక్కింపుతోనే న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూరి, నాగలకేర గోవిందు, శివకుమార్, హనుమేష్ కట్టమని, శంకర్ నందిహాళ్, లోకేష్, జయరాం తల మామిడి రాజు చలవాది కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కంప్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాళికాదేవి అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా మంగళవారం అమ్మవారికి ఒడినింపే కార్యక్రమం నిర్వహించారు. ప్రతి యేటా అమ్మవారికి శ్రావణమాసంలో ప్రత్యేకపూజలు నిర్వహించుకుంటామని ఆలయ కమిటీ అధికారులు తెలిపారు.



కాళికా దేవి అమ్మవారికి ఒడిబియ్యం అందజేస్తున్న మహిళలు



నిరసనలో ఆశా కార్యకర్తలు

డిమాండ్లు నెరవేర్చాలని ఆశావర్కర్ల ధర్నా

బళ్లారిరూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఆశావర్కర్లు ఆందోళన చేపట్టారు. మంగళవారం నగరంలో భారీఎత్తున ర్యాలీ నిర్వహిస్తూ మూడు రోజులు ధర్నా, రాత్రి సత్యాగ్రహం చేస్తున్నట్లు ఆశావర్కర్లు ఏఐటీయూ రాజ్యకార్యదర్శి నాగలక్ష్మీ, జిల్లా గౌరవ అధ్యక్షురాలు శాంత తెలిపారు. నాగలక్ష్మీ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన రాష్ట్ర గౌరవ వేతనం, కేంద్రం పాక్షిక ప్రోత్సాహాన్ని నెలకు కనీసం రూ. పది వేలు గౌరవ తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై శ్రద్ధ చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టామన్నారు. ఈ ధర్నాలో వందలాదిమంది ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాతో విద్యార్థుల్లో దేశభక్తి

● మాజీ సైనికుడు ప్రహ్లాద్ రెడ్డి



జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు

బళ్లారి సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హర్‌ఘర్ తిరంగ ప్రచారంలో భాగంగా తంజావూరులోని సదరన్ జోన్ కల్చరల్ సెంటర్, నగరంలోని ఎస్‌జీటీ గ్రూప్ ఆఫ్ ఆర్గనైజేషన్స్ మనుకుల ఆశ్రమ ట్రస్ట్‌నిర్వహించిన సాంస్కృతిక తోలుబొమ్మల ప్రదర్శనను మాజీ సైనికుడు ప్రహ్లాద్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. జాతీయజెండాలోని మూడు రంగులు, కాషాయం, తెలుపు, ఆకుపచ్చ త్యాగం, శాంతి,శ్రేయస్సుకు చిహ్నాలని విద్యార్థులకు సూచించారు. పండగలతో పాటు కీలమైన దేశపండగలను మరువరాదన్నారు. మరో సైనికుడు శేక్‌సాబు మాట్లాడుతూ కర్ణాటక అన్ని జాతులకు శాంతి ఉద్యానవనమని 22సంవత్సరాలుగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ సరిహద్దుల్లో పనిచేసిన తాను దేశసేవలో భాగస్వామ్యుడయినందుకు గర్వకారణంగా ఉందన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరి యూనివర్శిటీ సిటీ అడ్మినిస్ట్రేటివ్ నిర్మల అక్క, తంజావూరు సౌత్ ఇండియా కల్చరల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుందర్, కల్యాణస్వామి, భాస్కర్, ఆర్గనైజేషన్ నాగరాజు, ఎస్‌జీటీ సంస్థ అధ్యక్షుడు రుద్రప్ప తదితరులు మాట్లాడారు. అనంతరం తోలుబొమ్మల ప్రదర్శన మనుకుల ఆశ్రమ ట్రస్ట్ ప్రదర్శించిన కనకదాస తోలు బొమ్మల ప్రదర్శన అందరినీ ఆకర్షించింది. ఈసందర్భంగా ఎస్‌జీటీ కళాశాల ప్రిన్సిపాల్ రీనారెడ్డి, జర్నలిస్ట్ మంజునాథ్, మనుకుల ఆశ్రమ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మల్లికార్జున, కళ్యాణి పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రుల ఉత్తరారాధన



సత్యనారాయణపేటలో..



రాయలకాలనీలో..

బళ్లారి సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మంత్రాలయ గురు రాఘవేంద్ర తీర్థుల 354వ ఆరాధనను పురస్కరించుకుని ఉత్తర ఆరాధనను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.సత్యనారాయణ స్వామి రాఘవేంద్రుడి మఠంలో బృందావనానికి పంచామృత అభిషేకం నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. కనక మహాపూజ, నిర్మల విసర్జన, పండితుల ప్రవచనం తదితర పూజలు నిర్వహించారు. రాయల కాలనీ సంజీవరాయుడి మఠంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులందరికి అన్న సంతర్పణచేశారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ ప్రసన్నాచార్, తిమ్మన్నచార్, రాఘవేంద్ర ఆచార్, నేమకల్‌రావు, శ్రీధర్, సిమెంట్ గిరి, ప్రవచనకారలు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

కంప్లి పట్టణంలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు మూడు రోజుల పాటు కన్నుల పండువగా జరిగాయి. మంగళవారం చివరి రోజు కావడంతో స్వామివారికి పల్లకిసేవ రథోత్సవ ఊరేగింపు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిపారు. సాయంత్రం చిన్నారుల చేత భరత నాట్యం చేపట్టి ఆరాధన మహోత్సవాలు పూర్తిగా ఆకట్టుకునేలా చేపట్టారు. అలాగే ఆనెగొంది వద్ద నవ బృందావనంలో రాఘవేంద్రస్వామి బృందావనంకి ప్రత్యేక పూజలు పురోహితులు నిర్వహించారు.



అలంకరణలో రాఘవేంద్రుడు



ఊయల సేవలో

అన్ని వర్గాలకు సాధికారత కల్పించాలి: కలెక్టర్

బళ్లారి సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన వర్గాలకు సాధికారత కల్పించడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలన్నింటినీ వారికి అందించడానికి కృషి చేయాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ, జిల్లాపరిపాల,జిల్లాపంచాయితీ,షెడ్యూల్డ్‌కులాల సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని జిల్లా కలెక్టర్ హాల్లో తాలూకా స్థాయి మాస్టర్ ట్రైనర్ల కోసం నిర్వహించిన ధర్తి అభ జనజాతియ గ్రామ ఉత్కర్ష అభియాన్ కింద 'ఆది కర్మయోగి అభియాన్' అనే ఒక రోజు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రజల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, మంచిపాలన అందించాలన్నారు. ఇది సామాజిక పరివర్తనకు మాత్రమే కాకుండా దేశ అభివృద్ధికి కూడా దారితీస్తుందన్నారు. జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ మాట్లాడుతూ ఆది కర్మయోగి కేవలం ఒక కార్యక్రమం కాదని,ఇది దేశంలోని గిరిజన సమాజానికి సంబంధించిన కొత్త ఆలోచన అని అన్నారు. వివిధ ప్రాజెక్టులను అందించడం, ప్రజల నైపుణ్యాలను ప్రోత్సహించడం చాల ముఖ్యమన్నారు. ఈసందర్భగా ఆటవీ శాఖ ప్రాంతీయ విభాగం డిప్యూటీ కన్జర్వేటర్ బసవరాజ్,తాలూకా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి గాదిలింగప్ప, జిల్లా, తాలూకా స్థాయి అధికారులు ,శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

హోసూరు జోన్



భూమిపూజలో ఎమ్మెల్యే ప్రకాశ్

తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ

హోసూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హోసూరు అందివాడి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ప్రైవేట్ కంపెనీ మోడల్‌స్కూల్ సిస్టమ్ ప్రాజెక్టు కింద రూ.1.25కోట్లతో 7 తరగతి గదులను నిర్మించనున్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్యలు భూమిపూజ చేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. డిప్యూటి మేయర్ ఆనందయ్య, టీవీఎస్ మోటర్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కుప్పుస్వామి, పన్నులస్థాయి సమితి అధ్యక్షుడు చెన్నీరప్ప, ప్రైవేట్ కంపెనీ కార్యనిర్వాహకురాలు రమేశ్ ముత్తురామన్, ప్రధానోపాధ్యాయురాలు ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజలో ఎమ్మెల్యే

ధాయుమనవర్ పథకం కింద వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను ఆలకించి, అవసరమైన నిత్యావసర వస్తులను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ప్రకాశ్ హోసూరు పంచాయతీ యూనియన్ పూనవల్లి గ్రామంలోని రాజమ్మ ఇంటికి వెళ్లి నిత్యావసరాలు అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాన్యులతోపాటు వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను ఆలకించేందుకు వీలుగా ముఖ్యమంత్రి స్టాలిన్ పలు కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి రామమూర్తి, జిల్లా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి

అన్నాడీఎంకేతోనే రైతులకు న్యాయం

● మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి

హోసూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే అధికారంలోకి వస్తే రైతుల కష్టాలు తీరుతాయని మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి అభిప్రాయపడ్డారు. 2026 శాసనసభ ఎన్నికల్లో అధికారం దక్కించుకునేందుకు అధికార, ప్రతిపక్షాలు పోటాపోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయి. మాజీ సీఎం ఎడప్పాడి కే పళనిస్వామి తన పర్యటనలో రాయకోట్టై, కెలమంగలం, డెంకణీకోట్టై, హోసూరు, శూలగిరి ప్రాంతాలో సోమవారం ప్రచారం చేశారు. అన్నాడీఎంకే జిల్లా కార్యాలయాన్ని హోసూరులో మంగళవారం ప్రారంభించారు. అనంతరం చంద్రచూడేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. తర్వాత హిల్స్ రెస్టారెంట్‌లో పారిశ్రామికవేత్తలు, రైతులు, ప్రైవేట్ స్కూల్ యజమానులు, వ్యాపారులు, కార్మికులు తదితరులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు ఆలకించారు. అనంతరం ఎడప్పాడి మీడియాతో మాట్లాడుతూ హోసూరు నగరం అభివృద్ధి చెందిందని అయితే ఆ మేరకు ప్రాథమిక మౌలిక సదుపాయాలు మెరుగుపడలేదన్నారు. హోసూరులో ట్రాఫిక్ రద్దీ అధికమైందన్నారు. మరిన్ని పరిశ్రమలు రావాలంటే మౌలిక సదుపాయాలు మరింత పెరగాల్సి ఉందన్నారు. కాగా రైతుల కష్టాలపై అవగాహన ఉందని 65శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారన్నారు. సమావేశంలో పార్టీ డిప్యూటి జనరల్ సెక్రటరీ మునుసామి, తంబిదురై, అన్బగళన్, బాలకృష్ణరెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో పొంగిపొర్లుతున్న వాగులు

సిరుగుప్ప, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో రోడ్లపై నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అన్నిచోట్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజులపాటు వరుసగా భారీ వర్షం కురిసింది. తాలుకా వ్యాప్తంగా అన్ని చోట్ల 30 నుంచి 40 మిల్లీమీటర్లవరకు వర్షపాతం నమోదైంది. ఇలాగే వర్షాలు కురిస్తే పంటలపై దెబ్బతినే పరిస్థితి వుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కే బెళగల్ గ్రామం వద్ద పొంగుతున్న వాగు